
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 సిద్దిపేట
శుక్రవారం 7 జూన్ 2024




# హమ్మయ్య.. బతికిపోయాం..!

- విచారంలో ఇద్దరు.. విలాసంగా ముగ్గురు
- అంతర్మథనంలో అభ్యర్థులు
- టికెట్ దక్కనిదే మేలనుకుంటున్న ఆశావహులు
- ఆసక్తికరంగా బీఆర్ఎస్ రాజకీయం

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, జూన్ 6 : ఎందుకు పోటీ చేశామా అని ఆ ఇద్దరు అనుకుంటుంటే.. టికెట్ దక్కనిదే నయమైందని మరో ముగ్గురు సంతోష పడుతున్నారు... ఇదీ బీఆర్ఎస్ తరఫున పోటీ చేసిన ఎంపీ అభ్యర్థులు, టికెట్ కోసం యత్నించిన ఆశావహుల పరిస్థితి. పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు వెల్లడైన నేపథ్యంలో ఓడిన అభ్యర్థులు విచారంలో మునగగా.. టికెట్ ఆశించి భంగపడిన ఆ ముగ్గురు సంతోషపడుతున్నారు. రాష్ట్ర అవతరణ అనంతరం పదేళ్లు అధికారం సాగించిన బీఆర్ఎస్ శ్రేణులకు ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల ఫలితాలు మింగుడుపడడం లేదు.






### టికెట్ల లొల్లి

పార్లమెంట్ ఎన్నికల షెడ్యూలు రావడానికి మూడు నెలల ముందు నుంచే బీఆర్ఎస్‌లో టికెట్ల లొల్లి మొదలైంది. మెదక్ పార్లమెంట్ స్థానం టికెట్ రేసులో ఎమ్మెల్సీ వి.వెంకట్రామారెడ్డి, అటవీ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పేర్లు ప్రధానంగా వినిపించాయి. అయితే, ఎమ్మెల్సీ వెంకట్రామారెడ్డికి ఇంకా నాలుగు సంవత్సరాల పదవీ కాలం ఉండడంతో ఎంపీగా పోటీ చేయవద్దని కుటుంబ సభ్యులు వారించారు. ఆయన కుటుంబానికి కాంగ్రెస్, బీజేపీలో కీలక నేతలతోనూ సత్సంబంధాలు ఉండడం కూడా ఇందుకు ఒక కారణం. అంతేకాకుండా పార్లమెంట్ ఎన్నికల్లో రూ. 100 కోట్ల వరకు ఖర్చు చేయాల్సి వస్తుందనే ప్రచారం నేపథ్యంలో గెలిచినా.. ఐదేళ్ల పదవీకాలంలో తిరిగి అంత సంపాదించగలమా అని ప్రశ్నించినట్టు తెలిసింది. అందుకే వెంకట్రామారెడ్డి తొలుత పోటీకి నిరాకరించినట్టు అప్పట్లో ప్రచారం జరిగింది. దీంతో, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మెదక్ ఎంపీగా పోటీచేయడానికి వంటేరు ప్రతాప్‌రెడ్డికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టు తెలిసింది. అధినేత సూచనమేరకు వంటేరు అంతర్గతంగా ప్రచారం కూడా ప్రారంభించారు. తీరా టికెట్ ప్రకటించే సమయానికి ఎన్నికల ఖర్చు కోసం రూ. 100 కోట్లు పెట్టగలవా అని అధినేత ప్రశ్నించగా ఆయన వెనక్కి తగ్గినట్టు ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో కేసీఆర్, హరీశ్‌రావు స్వయంగా రంగంలోకిదిగి ఎమ్మెల్సీ వెంకట్రామారెడ్డిపై ఒత్తిడిచేసి పోటీకి సిద్ధం చేయించారు. కేసీఆర్‌తో ఉన్న సంబంధాలు, ఎలాగైనా గెలిచే సీటు అనే నమ్మకంతో ఆయన పోటీకి దిగి భారీగా ఖర్చు చేశారు. అయినా, చివరికి ఓడిపోవడమే కాకుండా మూడో స్థానంతో సరిపెట్టుకోవాల్సి రావడంతో వెంకట్రామారెడ్డి తీవ్ర ఆవేదనకు గురైనట్టు తెలిసింది. మరోవైపు పోటీ చేయలేక పోయిన వంటేరు ప్రతాప్‌రెడ్డి మాత్రం టికెట్ రాకపోవడమే మంచిదైందని సన్నిహితుల వద్ద వ్యాఖ్యానించినట్టు తెలిసింది.

### అనుకోకుండా జహీరాబాద్‌లో పోటీ

జహీరాబాద్ లోక్‌సభ స్థానం నుంచి బీఆర్ఎస్ తరఫున పోటీ చేసిన పటాన్‌చెరుకు చెందిన నాయకుడు గాలి అనిల్‌కుమార్ పరిస్థితి మరో విషాదం. అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీఆర్ఎస్‌లో చేరిన ఆయన మెదక్ లోక్‌సభ సీటు కోసం ప్రయత్నించారు. తనకు మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంలో పరిచయాలున్నాయని, అక్కడ టికెట్ ఇస్తే పోటీ చేస్తానని అనిల్‌కుమార్ ప్రతిపాదించారు. పార్టీ నాయకత్వం ఆయనకు జహీరాబాద్ టికెట్ ఇచ్చింది. కేసీఆర్, హరీశ్‌రావు ఒత్తిడి చేయడంతో పోటీకి సిద్ధపడి ప్రచారమైతే చేశారు. ఆయన కూడా భారీగానే ఖర్చు చేశారు. పోలింగ్ తేదీ సమీపించేసరికి గెలుపుపై ఆశలు లేవని గుర్తించి చేతులెత్తేశారు. దీంతో, బీఆర్ఎస్ శ్రేణులు ఈ నియోజకవర్గంలో బీజేపీకి అనుకూలంగా పనిచేశారని ప్రచారం జరిగింది. అనుకున్నట్టే ఫలితాలు వెలువడిన అనంతరం బీఆర్ఎస్ ఇక్కడ కూడా మూడో స్థానానికి పరిమితమైంది. జహీరాబాద్ ఎంపీ టికెట్ కోసం డీఎంఎంఎస్ చైర్మన్ ఎం.శివకుమార్, ట్రేడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ భిక్షపతి ప్రయత్నించారు. భిక్షపతి ఒక అడుగు ముందుకేసి తనకు టికెట్ ఇస్తే ఖర్చు పెట్టే మొత్తంపై పార్టీ నాయకత్వం ఎదుట ప్రతిపాదనలు కూడా ఉంచినట్టు తెలిసింది. అయినా పార్టీ టికెట్ ఇవ్వక పోవడంతో వీరిద్దరు ఇప్పుడు సంతోషంలో ఉన్నారు. వద్దనుకున్నా తప్పనిసరై పోటీచేసి రూ. కోట్లు ఖర్చు చేసిన గాలి అనిల్‌కుమార్ ఆవేదనలో పడినట్టు చెప్పుకుంటున్నారు.



# ఆశలు చిగురించేనా..

- తెరపైకి ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ
- నేడు షెడ్యూల్ వెలువడే అవకాశం..?

సిద్దిపేటక్రైం, జూన్ 6 : దాదాపు సంవత్సరం తర్వాత ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ మళ్లీ తెరపైకి రానున్నది. ఆగిపోయిన బదిలీల నోటిఫికేషన్ విడుదల చేస్తామని, ఈ నెల 7 నుంచి ప్రక్రియ తిరిగి ప్రారంభమవుతుందని రాష్ట్ర విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. దీంతో ఉపాధ్యాయుల్లో ఆశలు నెలకొన్నాయి. గత ప్రభుత్వం గతేడాది జనవరి చివరివారంలో టీచర్ల బదిలీలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ క్రమంలో పీజీహెచ్‌ఎంల ట్రాన్స్‌ఫర్లు, పీజీహెచ్‌ఎంల ప్రమోషన్లు, స్కూల్ అసిస్టెంట్ ట్రాన్స్‌ఫర్లు పూర్తయ్యాయి. ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్ ప్రమోషన్లు ఇచ్చే క్రమంలో ప్రమోషన్ పొందేవారు తప్పకుండా టెట్ అర్హత ఉండాలని చెప్పడంతో కొందరు ఉపాధ్యాయులు కోర్టును ఆశ్రయించడంతో ప్రక్రియ ఆగిపోయింది. విచారణలో భాగంగా పీఎస్ హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్లు ప్రమోషన్ పొందే వారికి టెట్ అవసరం లేదని కోర్టు తీర్పునిచ్చింది. చాలా రోజుల నుంచి ఉపాధ్యాయుల పదోన్నతి, బదిలీల ప్రక్రియ పెండింగ్‌లో ఉండడంతో నూతన ప్రభుత్వం టీచర్ల బదిలీల ప్రక్రియకు ఉన్న సమస్యలను పరిష్కరించి ఆగిపోయిన టీచర్ల బదిలీలు పదోన్నతులను కొనసాగించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో రాష్ట్ర విద్యాశాఖ అధికారులు నేడు నోటిఫికేషన్ విడుదల చేయడానికి సన్నద్ధం చేస్తున్నట్లు తెలుస్తుంది.

### ఉపాధ్యాయులకు ఊరట

జిల్లాలో 2018లో టీచర్ల ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్లు చేపట్టారు. నాటి నుంచి నేటి వరకు బదిలీలు కాలేదు. అయితే కొన్నేళ్లుగా జిల్లాలో పనిచేస్తున్న ఎంతోమంది ఉపాధ్యాయులు వేచి చూస్తున్నారు. గత ప్రభుత్వం జారీచేసిన 317 జీవోతో చాలామంది ఉపాధ్యాయులు సొంత జిల్లా నుంచి పొరుగు జిల్లాలకు బదిలీ అయ్యారు. రెండేళ్ల సర్వీస్ పూర్తిచేసుకున్న వారు తాజాగా అర్హులని ప్రభుత్వం ప్రకటించడంతో వీరికి మళ్లీ అవకాశం రానున్నది.

### జిల్లాలో 702 ఖాళీలు

సిద్దిపేట జిల్లాలో 363 ప్రాథమిక పాఠశాలలు, 113 ప్రాథమికోన్నత పాఠశాలలు, 227 హైస్కూల్స్ ఉన్నాయి. వీటిలో 4,837 పోస్టులకు గాను 4,135 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వర్తిస్తున్నారు. మొత్తంగా 702 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిలో ప్రభుత్వం 311 పోస్టులను డీఎస్సీ ద్వారా భర్తీ చేయనున్నది. ఇక ఈ ఏడాది జిల్లాలో సుమారు 38 మంది ఉద్యోగ విరమణ పొందనున్నారు. జిల్లాలో 1,920 మంది స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు, 1,990 మంది ఎస్జీటీ ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. 364 మంది ఎస్జీటీ ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్ ప్రమోషన్ రానున్నది. ఈ క్రమంలో ఆగిపోయిన ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు మళ్లీ కొనసాగుతాయా? ఆగిపోతాయా? అనే చర్చ ఉపాధ్యాయుల్లో జరుగుతున్నది.

# హైటెక్ వ్యభిచారం

- సిద్దిపేటను తాకిన గలీజుదందా
- అపార్ట్‌మెంట్లు, నివాస గృహాలే అడ్డాలుగా..
- అమ్మాయిలను రప్పిస్తున్న నిర్వాహకులు
- వాట్సాప్ ద్వారా వారి ఫొటోలు షేరింగ్
- ఆసక్తి కలిగిన మగవాళ్లతో బేరసారాలు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, జూన్ 6: "సిద్దిపేట పట్టణంలోని మైత్రివనం అంటే ఉన్నత వర్గాలు, ఉద్యోగులు, పేరున్న కుటుంబాలు నివాసముండే కాలనీ. ఇక్కడ పెద్ద ఎత్తున గృహాలతోపాటు అపార్ట్‌మెంట్లు నిర్మాణమయ్యాయి. ఈ కాలనీపై స్థానికులతోపాటు పోలీసుల నిఘా నిరంతరం ఉంటుంది. అయితే ఈ ప్రాంతంలోని ఓ అపార్ట్‌మెంట్‌లోని ఫ్లాటులో గుట్టుగా వ్యభిచారం సాగుతుందనే విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గతంలోనూ ఒకసారి ఇదే కాలనీలో ఈ గలీజు దందా బట్టబయలైంది. ఎవరికీ అనుమానం రాకుండా మహిళలే ఈ దందాను నడిపించడం చర్చనీయాంశంగా మారింది. పోలీసులకు సమాచారం అందడంతో ఎట్టకేలకు ఆ మహిళతోపాటు వ్యభిచారం సాగిస్తున్న ఆడ, మగ ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు.'

నిరంతరం నిఘా ఉండే మైత్రివనంలోనే ఇలాంటి దందాలు సాగుతుంటే మిగితా ఏరియాల్లో నెలకొన్న పరిస్థితిని ఊహించలేము. గతంలోనూ పలు కాలనీల్లో వ్యభిచార దందాలు వెలుగులోకి వచ్చాయి. సిద్దిపేట పట్టణంలోని లాడ్జిలు, హోటళ్లలో సైతం పోలీసులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిన సందర్భాలూ ఉన్నాయి. ఈ అక్రమ వృత్తిపై ప్రత్యేక దృష్టి సారిస్తే మరిన్ని విషయాలు బయటపడే అవకాశాలు లేకపోలేదు.

### అవసరాలే ఆసరాగా..

అవసరాలను కొంతమంది ఆసరాగా తీసుకుంటున్నారు. కుటుంబ పోషణ, ఇతర అవసరాలు ఉన్నవారిని తెలివిగా ఈ రొంపిలోకి దింపుతున్నారు. తాజాగా పట్టుబడిన సదరు మహిళ కూడా కమీషన్లు తీసుకుంటూ ఈ వృత్తి నిర్వహిస్తున్నట్లుగా చర్చ జరుగుతోంది. ఒక రోజంతా కూలి పనిచేసినా దక్కని సొమ్మును కేవలం గంటలోనే ఇప్పిస్తామని మాయమాటలు చెబుతూ ఈ దందాలోకి అడుగు పెట్టేలా చేస్తున్నారు. మహిళా నిర్వాహకులే కాకుండా పురుషులు కూడా ఉంటున్నట్లుగా తెలుస్తోంది. సిద్దిపేటలోని కోమటిచెరువు సమీపంలోనూ వ్యభిచార గృహాలు ఉన్నాయి. ఇక్కడ కొంత నిఘా ఉండడంతో మగరాయుళ్లు ఇలాంటి అడ్డదారులు వెతుక్కుంటున్నారు.



### రూ.2వేల నుంచి రూ.20వేల వరకు

అవసరాల కోసం ఈ వృత్తిలో దిగుతున్నవారు కొందరైతే, ప్రొఫెషనల్‌గా కొనసాగుతున్న వారు ఇంకొందరు. ఇక్కడ అమ్మాయి ఆధారంగా ధర నిర్ణయిస్తున్నట్లుగా తెలుస్తోంది. గంటకు ఒకరేటు, రాత్రికి ఒకరేటు, రోజంతా ఉంటే ఇంకో రేటు అని నిర్ణయిస్తున్నారు. రూ.2వేల నుండి రూ.20వేల వరకు వసూలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. హైదరాబాద్‌లోని పలు అపార్ట్‌మెంట్లు, మసాజ్ సెంటర్లు, నివాస గృహాల్లో ఈ దందాలు వెలుగుచూడడం నిత్యకృత్యంగా మారుతున్నాయి. ప్రస్తుతం ఇదే కల్చర్ సిద్దిపేట ప్రాంతాన్ని తాకడం విస్మయాన్ని కలిగిస్తోంది. గతంలో సిద్దిపేటకు చెందిన ఒకరిద్దరు వ్యక్తులు హైదరాబాద్‌లో వ్యభిచార దందాను నిర్వహిస్తూ పోలీసులకు చిక్కడం అప్పట్లో చర్చనీయాంశమైంది. ఇప్పుడేమో హైదరాబాద్ తరహాలోనే అచ్చంగా సిద్దిపేటలోనూ ప్రారంభమైంది. అంతేకాకుండా బ్రోకర్ల ద్వారా హైదరాబాద్, ఇతర ప్రాంతాల నుంచి అమ్మాయిలను కూడా సిద్దిపేటకు రప్పిస్తున్నారు.

### వాట్సాప్ ద్వారా బేరసారాలు..

వాట్సాప్ ద్వారానే వ్యభిచార దందాకు సంబంధించిన బేరసారాలు నడుస్తున్నట్లుగా తెలుస్తోంది. ఎవరైతే అమ్మాయిలు సిద్ధంగా ఉన్నారో వారి ఫొటోలను వాట్సాప్ ద్వారా మగవాళ్లకు పంపిస్తుంటారు. సదరు అమ్మాయిలు నచ్చితే ధర నిర్ణయించుకొని వారు చెప్పిన లొకేషన్‌కు వెళ్తున్నట్లుగా సమాచారం. పడుపు వృత్తిలో పాల్గొనే అమ్మాయితో సంబంధం లేకుండా ఆ నిర్వాహకులతోనే బేరసారాలు కుదుర్చుకొని ఆన్‌లైన్ పేమెంట్ పూర్తిచేస్తున్నట్లుగా తెలుస్తోంది. ఇదంతా కూడా హైటెక్ తరహాలోనే సాగుతోంది. సమాచారం ఉంటేనే టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఇప్పటికి మూడు, నాలుగు చోట్ల ఈ అక్రమ కార్యకలాపాలను వెలుగులోకి తెచ్చారు. ఇక ఓయో గదులు, హోటళ్లు, లాడ్జిలు, ఇతర అడ్డాలపై నిరంతరం నిఘా పాటిస్తే నియంత్రించే అవకాశాలు ఉంటాయి. లేదంటే అమాయకులైన ఆడవాళ్లు కూడా మాయమాటలకు ఈ రొంపిలోకి దిగి తమ జీవితాలను నాశనం చేసుకునే పరిస్థితులు వస్తాయి. అంతేగాకుండా వేలకువేలు వెచ్చిస్తూ మగవాళ్లు కూడా ఆర్థికంగా నష్టపోక తప్పదు.



సిద్దిపేటరూరల్‌లో ఇంటింటికి వెళ్లి పిల్లలను బడిలో చేర్పించాలని కోరుతున్న ఉపాధ్యాయ బృందం

## ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి చర్యలు చేపట్టాలి

- జిల్లా విద్యాశాఖాధికారి శ్రీనివాస్‌రెడ్డి
- బడిబాట కార్యక్రమంలో భాగంగా ర్యాలీలు

8లో

# ప్రైవేట్ పాఠశాలల దందా!

- జోరుగా పుస్తకాలు, స్టేషనరీ విక్రయాలు
- ప్రారంభానికి ముందే కొనుగోలు చేయాలని తల్లిదండ్రులపై ఒత్తిడి




సిద్దిపేట క్రైం, జూన్ 6: ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజుల వసూలుతో పాటు పుస్తకాల పేరుతో జోరుగా దందా నడుపుతున్నారు. పుస్తకాలు, నోట్‌బుక్స్‌ను కొన్ని పాఠశాలల్లో అధిక ధరలకు అమ్ముతున్నట్లు విద్యార్థుల ఆరోపిస్తున్నారు. పుస్తకాలు, యూనిఫాం ఇతర స్టేషనరీ అమ్మకూడదని విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. అయితే ఆ ఆదేశాలను జిల్లాలోని కొన్ని స్కూళ్లు అస్సలు పట్టించుకోవడం లేదు.

విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే పుస్తకాలు, నోట్‌బుక్స్, ఇతరత్రా సామగ్రి తీసుకోవాలని కూడా ఒత్తిడి తెస్తున్నారు. పాఠ్యపుస్తకాలతో పాటు నోట్‌బుక్‌లను వారి పాఠశాలకు సంబంధించిన ప్రత్యేక పుస్తకాల పేరిట ఒక్క విద్యార్థి నుంచి రూ.5వేల నుంచి రూ.10వేల వరకు వసూలు చేస్తున్నారు. ఇందులో కూడా వివిధ ఆఫర్లు అంటూ తల్లిదండ్రులను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు. గతేడాది జిల్లాకేంద్రంలోని కొన్ని ప్రైవేటు పాఠశాలల్లో బహిరంగంగానే పాఠ్యపుస్తకాలు అమ్మగా విద్యార్థి సంఘాలు పట్టుకుని విద్యాధికారులకు ఫిర్యాదు చేశాయి. ఎంఈవో ఆ పాఠశాల పుస్తకాల రూంను సీజ్ చేశారు. అయినా కూడా ఈ సంవత్సరం ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాలను తమ ఇష్టానుసారం ధరలు నిర్ణయించి అమ్ముతున్నారన్న ఆరోపణలున్నాయి.

### బుక్ డిపోలతో కమిషన్..

సిద్దిపేటలో కొన్ని ప్రైవేటు పాఠశాలలు జిల్లా కేంద్రంలో ఉన్న పలు బుక్ డిపోలతో కమిషన్ విధానంలో దందా నడిపిస్తున్నట్లు తెలుస్తుంది. ప్రైవేటు పాఠశాలకు సంబంధించిన పుస్తకాలు, నోట్‌బుక్స్‌ను వారికి సంబంధించిన బుక్‌డిపో వారు ప్రత్యేకంగా ప్రింట్ చేయించి విక్రయాలు జరుపుతున్నారు. ఆ ప్రైవేటు పాఠశాలకు సంబంధించిన పుస్తకాలు ఆ పాఠశాలకు సంబంధించిన బుక్ డిపోలో మాత్రమే దొరుకుతాయి మరే బుక్‌డిపోలో కూడా దొరకవు. చేసేదేమి లేక విద్యార్థుల తల్లిదండ్రులు కూడా స్కూలు వారు చెప్పిన డిపోలోనే కొనుగోలు చేస్తున్నారు. ఇక బుక్ డిపో వారు ప్రైవేటు పాఠశాల సంబంధించిన బుక్స్ ప్రింట్ చేసేటప్పుడు వారే ఎమ్మార్పీ కన్నా ఎక్కువ వేసి అధిక ధరలకు అమ్ముతున్నారు. ఇందులో వచ్చిన లాభంలో నుంచి కొంత ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలకు చేరుతుంది. జిల్లాలో సుమారు 200 వరకు ప్రైవేట్ స్కూల్స్ కార్పొరేట్ స్కూల్స్ ఉన్నాయి. వీటిలో కార్పొరేట్ స్కూల్‌తో పాటు కొన్ని ప్రైవేటు స్కూల్స్ తమ పాఠశాలలో విచ్చలవిడిగా పుస్తకాల విక్రయాలు జరుగుతున్నప్పటికీ సంబంధిత విద్యాధికారులు పట్టించుకోవడంలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.





#### పాఠశాలల్లో పుస్తకాలు అమ్మితే చర్యలు
**- శ్రీనివాస్‌రెడ్డి, డీఈవో**

జిల్లాలో కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్లలో పుస్తకాలు అమ్మినట్లు మా దృష్టికి వస్తే కఠినమైన చర్యలు తీసుకుంటాం. ప్రైవేటు పాఠశాలల్లో పుస్తకాలు విక్రయించడం చట్టరీత్యా నేరం. జిల్లాలో ఉన్న ప్రతీ ప్రైవేటు పాఠశాలలు ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం నడుచుకోవాలి. లేదంటే చర్యలు తప్పవు.

# నల్లా కనెక్షన్లపై ఇంటింటి సర్వే నిర్వహించాలి

- అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్

సిద్దిపేట అగ్రికల్చర్, జూన్ 6 : జిల్లాలోని మిషన్‌భగీరథ నల్లాకనెక్షన్లపై ఇంటింటి సర్వే నిర్వహించాలని అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో మిషన్‌భగీరథ మొబైల్ అప్లికేషన్‌పైన నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ముందుగా జిల్లా తరఫున హైదరాబాద్‌లో శిక్షణ పొందిన మాస్టర్ ట్రైనర్స్‌తో ప్రొజెక్టర్ ద్వారా పవర్‌పాయింట్ ప్రజంటేషన్ మొబైల్ అప్లికేషన్ చేసే విధానం గూర్చి క్లుప్తంగా వివరించారు. ఈ మొబైల్ అప్లికేషన్ సర్వే కోసం జిల్లాలోని ఆయా గ్రామాల్లో పంచాయతీ సెక్రటరీలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు, ఇతరులను



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్

దాదాపు 1200 మందికి రెండు సెషన్లలో శిక్షణ ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సుమారు 2.17 లక్షల నల్లా కనెక్షన్లు ఉన్నాయని పేర్కొన్నారు. ఇక సర్వేలో జిల్లాలో మిషన్‌భగీరథ కనెక్షన్‌లు ఎన్ని? ఇతర నల్లా కనెక్షన్లు ఎన్ని? నీరు వస్తుందా? నీరు రాని కనెక్షన్ల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించడం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ప్రతీ ఆపరేటర్ ఇంటింటికీ తిరిగి నల్లా కనెక్షన్ చెక్ చేసి కుటుంబ సభ్యుల వివరాలను ఈ మొబైల్ అప్లికేషన్‌లో నమోదు చేయాలని ఆమె సూచించారు. సర్వేలో తప్పనిసరిగా నల్లా కనెక్షన్ ఫొటో, కుటుంబ యజమాని ఫొటో తీసుకోవాలని చెప్పారు. ప్రతీ ఆపరేటర్ రోజూ 25 అప్లికేషన్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో రమేష్, డీపీవో దేవకీ దేవి, మిషన్ భగీరథ ఎస్ఇ శ్రీనివాస్‌చారి, ఈఈ గిరిధర్ మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన అధికారులు

## మంజీరాలో దూకి బావామరదళ్ల ఆత్మహత్య

మనూరు, జూన్ 6: పెళ్లికి పెద్దలు అంగీకరించకపోవడంతో బావామరదళ్లు మంజీరా నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన సంగారెడ్డి జిల్లా మనూరు మండలం పూల్‌కుర్తి వద్ద చోటుచేసుకున్నది. ఎస్ఐ అబ్ర్యానాయక్ తెలిపిన వివరాల ప్రకారం నారాయణఖేడ్ మండలం చాప్టా.కె గ్రామానికి చెందిన ఉమా అలియాస్ బసమ్మ (21), న్యాల్‌కల్ మండలం కాకిజన్‌వాడేకు చెందిన సదానందం కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. ఇద్దరు స్వయాన బావ, మరదళ్లు. వారు తమ ప్రేమ విషయం ఇంట్లో చెప్పినప్పటికీ, ఇరు కుటుంబాల పెద్దలు అంగీకరించలేదు. దీంతో రెండు రోజుల క్రితం సదానందం, ఉమ ఇళ్ల నుంచి వెళ్లిపోయారు. మనూరు మండలం పూల్‌కుర్తి వద్ద వంతెనపై బైక్, చెప్పులు ఉండడంతో పోలీసులు అనుమానంతో మంజీరా నదిలో గాలించగా గురువారం సాయంత్రం ఇద్దరి శవాలు తేలాయి. మృతదేహాలను నదిలో నుంచి బయటకు తీయించిన పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం నారాయణఖేడ్ ఆస్పత్రికి తరలించారు.

## బోరు పైపులు ధ్వంసం.. కుప్పకూలి రాయిమీద పడి రైతు మృతి

- పైపులు ధ్వంసం చేసిన వ్యక్తి ఇంటి ఎదుట మృతదేహంతో ఆందోళన
- పోలీసుల జోక్యం.. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు

6

7

## మెజారిటీ ప్రజాప్రతినిధులు ఉన్నా.. మూడో స్థానమా?

- హుస్నాబాద్ సెగ్మెంట్‌పై బీఆర్ఎస్‌లో అంతర్మథనం

### బోరు పైపులు ధ్వంసం..

# కుప్పకూలి రాయిమీద పడి రైతు మృతి

- పైపులు ధ్వంసం చేసిన వ్యక్తి ఇంటి ఎదుట మృతదేహంతో ఆందోళన
- పోలీసుల జోక్యం.. కుటుంబ సభ్యుడి ఫిర్యాదుతో కేసు నమోదు

మద్దూరు, జూన్ 6 : పక్క భూమి రైతు బోరు పైపులను ధ్వంసం చేయగా, ఆ బోరు వద్దే రాయిమీద పడి ఓ అన్నదాత మృతిచెందాడు. న్యాయం చేయాలని ఆ రైతు ఇంటి ఎదుట మృతదేహంతో కుటుంబసభ్యులు ఆందోళనకు దిగారు. ఈ సంఘటన మద్దూరు మండలం మర్మాముల గ్రామంలో బుధవారం జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన సుందరగిరి రాములు, ఉప్పల పెద్దకిష్టయ్యకు పక్కపక్కనే పొలాలు ఉన్నాయి. ఐదారేళ్ల క్రితం భూముల కొలతలు చూసుకున్నారు. పెద్దకిష్టయ్య బోరు సుందరగిరి రాములు భూమిలోకి వచ్చింది. గ్రామ పెద్దల సమక్షంలో జరిగిన పంచాయతీలో 30 ఏళ్ల క్రితం వేసుకున్న బోరును ముట్టుకోవద్దని చెప్పి రాములుకు ఏడు గుంటల భూమిని పెద్దకిష్టయ్య నుంచి ఇప్పించారు. ఇటీవల ఉప్పల పెద్దకిష్టయ్య రూ.3 లక్షల దాకా అప్పు చేసి ఉన్న కొద్దిపాటి భూమికి నీళ్లు సరిపోనందున కొత్తగా మూడు బోర్లు వేయించగా చుక్కనీరు పడ లేదు. ఈ క్రమంలో సుందరగిరి రాములు బోరు తన దేనని, ఏడు గుంటల భూమి తనకు అక్కరలేదని పెద్దకిష్టయ్యకు చెప్పాడు. బుధవారం రోజున పెద్దకిష్టయ్యకు చెందిన బోరు పైపులైన్, మోటారు స్టాటర్‌ను రాములు ధ్వంసం చేయడంతో పొలానికి నీళ్లు బందయ్యాయి. బోరు వద్దకు వెళ్లిన పెద్ద కిష్టయ్య అక్కడి పరిస్థితిని చూసి కుప్పకూలి రాళ్ల మీద పడి అక్కడికక్కడే మృతిచెందాడు. దీంతో న్యాయం కోసం కుటుంబ సభ్యులు ఉప్పల కిష్టయ్య శవాన్ని సుందరగిరి రాములు ఇంటి ఎదుట వేసి ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ షేక్ యూనస్ అహ్మద్ అలీ, ఏఎస్‌ఐ జగదీశ్వర్, సిబ్బందితో కలిసి మర్మాముల గ్రామానికి చేరుకున్నారు. జరిగిన సంఘటనపై ఆరా తీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేర్యాల మార్చురీకి తరలించారు. అయితే పోలీసుల కథనం మరోలా ఉన్నది. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం బోరు వద్ద బోల్టులు విప్పి ఉండటంతో కిష్టయ్యకు తన అల్లుడు సమాచారం అందించాడు. మధ్యాహ్నం కిష్టయ్య బోల్టులు బిగించే సమయంలో ప్రమాదవశాత్తు వెనుకకు పడిపోగా తలకు రాయి తగలడంతో రక్తస్రావం జరిగి చనిపోయాడు. కిష్టయ్య అల్లుడు గుడ్ల రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కిష్టయ్యకు భార్య పుష్ప, దివ్యాంగురాలైన కూతురు ఉన్నారు.

### పోతారం(ఎస్)లో

## ముగిసిన వేసవి కబడ్డీ శిక్షణ శిబిరం

- క్రీడాకారులకు దుస్తులు పంపిణీ

హుస్నాబాద్‌రూరల్, జూన్ 6 : హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్)లో నిర్వహించిన వేసవి కబడ్డీ శిక్షణ శిబిరం ముగిసినట్లు కబడ్డీ క్రీడాకారుడు, హోంగార్డు మడక కృష్ణ తెలిపారు. నెల రోజులుగా కబడ్డీ శిక్షణ పొందిన క్రీడాకారులకు ఆర్మీలో పనిచేస్తున్న సాయికృష్ణ పంపించిన క్రీడా దుస్తులను హుస్నాబాద్ క్రీడల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కేడం లింగమూర్తి అందజేశారు. ఈ సందర్భంగా కేడం లింగమూర్తి మాట్లాడుతూ హుస్నాబాద్ నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కృషి చేస్తున్నారని, రాబోయే రోజుల్లో ఇలాంటి క్యాంపులను మరిన్ని నిర్వహిస్తామని తెలిపారు. పోతారం(ఎస్)లో హోంగార్డు కృష్ణ ఆధ్వర్యంలో సమ్మర్ కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేసి క్రీడాకారులకు కబడ్డీ శిక్షణ ఇవ్వడం పట్ల అభినందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారుడు వెన్న రాజు, మండల నాయకులు బంక చందు, బాలయ్య, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

### రాజగోపాలపేట పాలిటెక్నిక్ కళాశాలలో

## ఈ సెట్ కౌన్సెలింగ్‌కు ఏర్పాట్లు

నంగునూరు, జూన్ 6 : నంగునూరు మండలం రాజగోపాలపేట పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 8 నుంచి నిర్వహించనున్న ఈ సెట్ కౌన్సెలింగ్ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ సూర్యనారాయణ తెలిపారు. మూడు సంవత్సరాల పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులను పూర్తిచేసి, నేరుగా ఇంజనీరింగ్ రెండో సంవత్సరంలోకి ప్రవేశం కోసం ఈ సెట్ రాసి ర్యాంకులు సాధించిన అభ్యర్థులకు మొదటి విడత కౌన్సెలింగ్ ప్రక్రియను చేపట్టనున్నారు.

**కౌన్సెలింగ్ జరిగే విధానం..**

ఈ సెట్‌లో ర్యాంకు సాధించిన అభ్యర్థులు ఈ నెల 8 నుంచి 11 వరకు వెబ్‌సైట్‌లో స్లాట్‌ను నమోదు చేసుకోవాలి. స్లాట్ ప్రకారంగా విద్యార్థులకు 10 నుంచి 12వ తేదీ వరకు రాజగోపాలపేట పాలిటెక్నిక్ కళాశాలలో ధ్రువపత్రాలను పరిశీలిస్తారు. అభ్యర్థులు ఈ నెల 10 నుంచి 14 వరకు ఆన్‌లైన్‌లో వెబ్‌ఆప్షన్ ద్వారా కాలేజీలను ఎంపిక చేసుకోవాలి. 18లోపు వెబ్‌ఆప్షన్లు పెట్టుకున్న అభ్యర్థులకు సీట్ల కేటాయింపు జరుగుతుంది. సీట్లు పొందిన అభ్యర్థులు 18 నుంచి 21 వరకు కాలేజీల్లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలి. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే అభ్యర్థులు తమ వెంట ర్యాంక్ కార్డు, డిప్లొమా మార్కుల మెమో, స్టడీ సర్టిఫికెట్స్, కుల, ఆదాయ ధ్రువపత్రాలతో పాటు ఒరిజినల్ ఆధార్‌కార్డుతో హాజరుకావాలి.

# 12, 14 తేదీల్లో త్రిబుల్ ఆర్ భూముల రైతులతో సమావేశం : నర్సాపూర్ ఆర్డీవో

నర్సాపూర్, జూన్ 6: త్రిబుల్‌ఆర్ రోడ్డు కోసం భూములు సేకరించనున్న రైతులతో ఈ నెల 12, 14వ తేదీల్లో నర్సాపూర్‌లో సమావేశం నిర్వహించి వారికిచ్చే పరిహారంపై చర్చించనున్నట్లు ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన నర్సాపూర్‌లోని ఆర్డీవో కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని నర్సాపూర్, శివ్వంపేట మండలాల్లో పలు గ్రామాలకు చెందిన రైతుల భూములను ఇప్పటికే త్రిబుల్‌ఆర్ రోడ్డు కోసం సర్వే చేసి గుర్తించినట్లు చెప్పారు. సర్వే చేసిన భూములకు సంబంధించి 12వ తేదీన శివ్వంపేట మండల పరిధిలోని పోతులబోగుడ, కొత్తపేట, పాంబండ, లింగోజిగూడ, గుండ్లపల్లి గ్రామాలకు చెందిన రైతులతో నర్సాపూర్‌లోని రైతువేదికలో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. 14న నర్సాపూర్ మండల పరిధిలోని నాగులపల్లి, తుజాల్‌పూర్, తిర్మలాపూర్, పెద్దచింతకుంట, ఖాజీపేట, మూసపేట, తిర్మలాపూర్ గ్రామాల రైతులతో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే గుర్తించిన ఆయా గ్రామాల రైతులు తమ ఆధార్‌కార్డు, పట్టాపాసుపుస్తకం, పాన్‌కార్డు తదితర పత్రాలతో సమావేశాలకు హాజరుకావాలని ఆర్డీవో కోరారు.

## సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన షెట్కార్ కుటుంబసభ్యులు

నారాయణఖేడ్, జూన్ 6 : జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి ఎంపీగా ఎన్నికైన సురేష్‌కుమార్ షెట్కార్ గురువారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రిని తమ కుటుంబసభ్యులతో కలిశారు. వారు రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన కుమార్తె టీపీసీసీ స్పోక్స్‌పర్సన్ గిరిజాషెట్కార్, కుమారుడు రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రాకేష్ షెట్కార్, ఆయన సతీమణి స్నేహాషెట్కార్, సోదరులు నగేష్ షెట్కార్, జితేందర్‌నాథ్ షెట్కార్, సోదరుడి కుమారుడు సాగర్ షెట్కార్, మాజీ జడ్పీటీసీ సంగీత షెట్కార్, టీపీసీసీ సభ్యులు శ్రీనివాస్, శివానీషెట్కార్, తన్వీషెట్కార్ తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.



సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న షెట్కార్ కుటుంబసభ్యులు



## ఎల్లవేళలా అందుబాటులో ఉంటా..

- ఆదరించిన ప్రజలకు, నాయకులకు కృతజ్ఞతలు
- మాజీ ఎంపీ బీబీ పాటిల్



మాట్లాడుతున్న బీబీ పాటిల్

జహీరాబాద్, జూన్ 6 : పార్లమెంట్ ఎన్నికల్లో తాను ఓటమి చెందడం బాధాకరమైనప్పటికీ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవ చేస్తానని జహీరాబాద్ బీజేపీ అభ్యర్థి, తాజా మాజీ ఎంపీ బీబీ పాటిల్ అన్నారు. గురువారం జహీరాబాద్ పట్టణంలోని ఇంద్రప్రస్థాన్‌లో నిర్వహించిన జహీరాబాద్ పార్లమెంటరీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో నరేంద్రమోదీ నేతృత్వంలో బీజేపీ అధికారంలోకి రావడం సంతోషకరమన్నారు. తనను జహీరాబాద్ పార్లమెంట్ ప్రజలు తనను గెలుపు అంచుల వరకు తీసుకెళ్లారని, తనకు ఓట్లు వేసి ఆదరించిన ప్రజలకు, క్షేత్రస్థాయిలో బీజేపీ కోసం అహర్నిశలు పనిచేసిన నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. గడిచిన పదేళ్లలో జహీరాబాద్ పార్లమెంట్ అభివృద్ధికి ఎంతో కృషి చేశానని, అదే తరహాలో అందరికీ అందుబాటులో ఉండి సేవలందిస్తానన్నారు. ప్రధానమంత్రిగా నరేంద్రమోదీ మూడోసారి అధికార పగ్గాలు చేపట్టడం హర్షించదగ్గ విషయమన్నారు. ప్రజలు, నాయకులు, కార్యకర్తలు బీజేపీ అభిమానులు నిరుత్సాహానికి గురికావద్దని, ఎక్కడ సమస్య ఉంటే అక్కడ వాలిపోతామన్నారు. బీజేపీ పెద్దల సహకారంతో జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసుకుందామన్నారు. అనంతరం బీజేపీ రాష్ట్ర నాయకులు జైపాల్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, విజేందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి తదితరులు మాట్లాడారు. నరేంద్రమోదీ ప్రభావంతో పాటు కార్యకర్తల కృషి తోడు కావడంతో బీజేపీకి గత ఎన్నికల కంటే ఓటుబ్యాంకు భారీగా పెరిగిందన్నారు. ఎవరు నిరుత్సాహానికి గురికాకుండా సంఘటితంగా పనిచేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జహీరాబాద్ అసెంబ్లీ కన్వీనర్ నౌబాద్ జగన్, బీజేపీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, ఉమాకాంత్‌పాటిల్, సుదీర్ బండారి, విశ్వనాథ్, వైద్యనాథ్, శ్రీనివాస్‌గుప్త, దేశెట్టిపాటిల్, ఉమాకాంత్‌పాటిల్, ఢిల్లీ వసంత్, సంతోష్, నరేష్‌పాటిల్, సోమఅనిల్, సుభాష్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, భూమయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దత్తగిరి ఆశ్రమంలో మంత్రి దామోదర్ ప్రత్యేక పూజలు

ఝరాసంగం, జూన్ 6 : శనేశ్వరుని జయంతి, అమావాస్య సందర్భంగా మండల పరిధిలోని బర్దీపూర్ దత్తగిరి ఆశ్రమంలో గురువారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రత్యేక పూజలు చేశారు. ఆశ్రమ అర్చకులు వేదమంత్రోచ్చారణలు, మంగళావాయిద్యాల మధ్య మంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. శనేశ్వరుడికి తైలం, నల్లవస్త్రాలు, నువ్వులతో పూజలు నిర్వహించారు. అదేవిధంగా ఆశ్రమంలోని నవగ్రహాలకు, పంచవృక్షాలకు అభిషేకం చేశారు. ఆశ్రమ పీఠాధిపతి వైరాగ్య శిఖమణి అవదూత గిరిమహరాజ్ మంత్రిని ఆశీర్వదించి, తీర్థప్రసాదాలను అందజేశారు. మాజీ మంత్రి జె.గీతారెడ్డి ప్రత్యేక పూజలు చేయగా, అవదూత గిరి మహరాజ్ ఆమెను ఆశీర్వదించారు. ఆశ్రమ బావి పీఠాధిపతి సిద్ధయ్య స్వామి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హనుమంతురావు పాటిల్, కాంగ్రెస్ నాయకులు తన్వీర్, ఉదయ్ శంకర్ పాటిల్, శంకర్ పాటిల్, నరేష్ కుమార్, ఆయా గ్రామాల నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

### కేతకీలో అమావాస్య పూజలు

దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయంలో గురువారం అమావాస్య సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అమృత గుండంలో స్నానాలు ఆచరించి స్వామి వారిని దర్శించుకున్నారు. కర్ణాటక, మహారాష్ట్రలతో పాటు జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయాధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.



దత్తగిరి ఆశ్రమంలోని శనేశ్వరుడికి పూజలు నిర్వహిస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

# మెజారిటీ ప్రజాప్రతినిధులు ఉన్నా.. మూడో స్థానమా?

- హుస్నాబాద్ సెగ్మెంట్‌పై బీఆర్ఎస్ పార్టీలో అంతర్మథనం

హుస్నాబాద్, జూన్ 6 : కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని హుస్నాబాద్ సెగ్మెంట్‌లో ఓట్ల వేటలో చతికిలపడడంతో బీఆర్ఎస్ పార్టీలో అంతర్మథనం మొదలైంది. నియోజకవర్గంలో మెజార్టీ ప్రజాప్రతినిధులు బీఆర్ఎస్‌కు చెందిన వారైనప్పటికీ ఓట్లు తగ్గడాన్ని ఆ పార్టీ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో మొదటిస్థానంలో ఉండి ఈసారి మూడో స్థానానికి పరిమితం కావడంలో అంతర్యమేమిటని మథనపడుతున్నారు. హుస్నాబాద్ సెగ్మెంట్‌లో అక్కన్నపేట, కోహెడ, హుస్నాబాద్, చిగురుమామిడి, భీమదేవరపల్లి, సైదాపూర్, ఎల్కతుర్తి మండలాలున్నాయి. ఈ ఏడు మండలాల్లో చిగురుమామిడి, సైదాపూర్ కరీంనగర్ జిల్లాలో, హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ సిద్దిపేట జిల్లాలో, భీమదేవరపల్లి, ఎల్కతుర్తి హన్మకొండ జిల్లాలో ఉన్నాయి. ఏడుగురు ఎంపీపీలు, ఆరుగురు జడ్పీటీసీల్లో ఒకరు జడ్పీ చైర్మన్, ఇద్దరు జడ్పీ వైస్ చైర్మన్లు, ఎంపీటీసీలతో పాటు హుస్నాబాద్ మున్సిపాలిటీలోనూ మెజార్టీ ప్రజాప్రతినిధులు బీఆర్ఎస్ వారే. ఇంతమంది ఉండి, గ్రామస్థాయిలోనూ చెక్కుచెదరని కార్యకర్తల బలం ఉన్నప్పటికీ బీజేపీ కంటే తక్కువ ఓట్లు రావడానికి కారణాలు ఏమిటో విశ్లేషిస్తున్నారు. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ గెలుపొందగా హుస్నాబాద్ సెగ్మెంట్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్‌కు 66,885, కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్‌కు 44,123 ఓట్లు, బండి సంజయ్‌కి 43,144 ఓట్లు వచ్చాయి. ప్రస్తుత ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుకు 79,001, బండి సంజయ్‌కి 55,873, బోయినపల్లి వినోద్‌కుమార్‌కు 41,298 ఓట్లు వచ్చాయి. గత ఎన్నికల కంటే బీఆర్ఎస్‌కు 25,587 ఓట్లు తగ్గాయి. బీజేపీకి 12,729 ఓట్లు పెరిగాయి. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సొంత నియోజకవర్గం కావడంతో ఇక్కడ కాంగ్రెస్‌కు 23,128 ఓట్ల మెజార్టీ వచ్చింది. ఏదేమైనా మెజార్టీ ప్రజాప్రతినిధులు, పటిష్టమైన కార్యకర్తల బలం ఉండి ఓట్లు తగ్గడానికి కారణాలపై విశ్లేషిస్తున్నారు.



కంటైనర్ లారీ ఢీకొనడంతో బోల్తా పడిన కారు

## కంటైనర్ ఢీకొని కారు పల్టీ

- హల్దీవాగు బ్రిడ్జిపై ప్రమాదం.. తప్పిన ప్రాణాప్రాయం

తూప్రాన్, జూన్ 6 : హల్దీవాగు బ్రిడ్జి మీదుగా వెళుతున్న కారును వెనుకగా వచ్చిన కంటైనర్ ఢీకొనడంతో కారు పల్టీ కొట్టిన సంఘటన మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణ శివారులో గురువారం చోటు చేసుకున్నది. వివరాల్లోకి వెళితే.. నిజామాబాద్‌కు చెందిన గోపి, తరుణ్, రాకేష్, చింటు, సాయి, ప్రణీత్ దైవ దర్శనార్థం యాదాద్రికి వెళ్లి తిరుగు ప్రయాణం అయ్యారు. తూప్రాన్ పట్టణానికి చేరుకుని 44వ జాతీయ రహదారిపై వెళుతున్నారు. తూప్రాన్ పట్టణం దాటి హల్దీవాగుపై నిర్మించిన బ్రిడ్జి మీదుగా వెళుతుండగా కంటైనర్ లారీ వేగంగా వచ్చి కారును వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ సంఘటనతో కారు నాలుగు పల్టీ కొట్టి బ్రిడ్జి సైడ్ రేలింగ్ వరకు వెళ్లి నిలిచిపోయింది. తృటిలో పెద్ద ప్రమాదం తప్పింది. రేలింగ్ దాటితే హల్దీవాగు నీటిలో పడిపోయి భారీ ప్రమాదం జరిగి ఉండేదని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. స్వల్ప గాయాలతో ఆరుగురు బయటపడటంతో ఊపిరి పీల్చుకున్నారు. కంటైనర్ లారీ డ్రైవర్ పరారీలో ఉన్నాడు.

## అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో సిద్దిపేట క్రీడాకారుడికి కాంస్యం



తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్ కార్యదర్శి సారంగపాణి నుంచి పతకం, సర్టిఫికెట్‌ను అందుకుంటున్న గాడిచర్ల జితేష్

సిద్దిపేట టౌన్, జూన్ 6 : హనుమకొండలో నిర్వహించిన పదో తెలంగాణ రాష్ట్ర సబ్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో సిద్దిపేట క్రీడాకారుడు గాడిచర్ల జితేష్ కాంస్య పతకం సాధించారని అథ్లెటిక్స్ అసోసియేషన్ సిద్దిపేట జిల్లా కమిటీ గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. గాడిచర్ల జితేష్ 300 మీటర్లను 48 సెకన్లలో పూర్తి చేశాడని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్ కార్యదర్శి సారంగపాణి జితేష్‌కు కాంస్య పతకం, మెరిట్ సర్టిఫికెట్‌ను అందజేశారని తెలిపారు. ఈ సందర్భంగా అథ్లెటిక్స్ అసోసియేషన్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు గ్యాదరి పరమేశ్వర్, కార్యదర్శి వెంకటస్వామి, కోచ్ కల్లపల్లి కృష్ణ జితేష్‌ను అభినందించారు.

# ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి చర్యలు చేపట్టాలి

● జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి

మద్దూరు, జూన్ 6: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతుందని, ఇందుకు బడిఈడు పిల్లలందరూ బడిలో ఉండే విధంగా చూస్తూ, ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను తల్లిదండ్రులకు వివరించాలని జిల్లా విద్యాశాఖాధికారి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. మద్దూరు మండలకేంద్రంలో హెచ్‌ఎం చంద్రశేఖర్ అధ్యక్షతన బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో పాల్గొని పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని తలిదండ్రులను కోరారు. అనంతరం డీఈవో మాట్లాడారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు. దుస్తులు, నోట్‌బుక్స్, డిజిటల్ క్లాసులు, మధ్యాహ్న భోజనాల వంటి అనేక సౌకర్యాలను అందిస్తున్నందున సద్వినియోగం చేసుకోవాలని సూచించాలన్నారు. కార్యక్రమంలో కస్తూర్బా పాఠశాల సిబ్బంది, సీఆర్పీలు పాల్గొన్నారు.

● **కొండపాక:** బడీడు పిల్లలను బడిలో చేర్పించి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంఈవో శ్రీనివాసరెడ్డి అన్నారు. కొండపాల మండలంలోని దుద్దెడలో బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పెద్దివిఠల్ తదితరులు ఉన్నారు.

● **కుకునూరుపల్లి:** మండల కేంద్రంలో గురువారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉన్నత పరిషత్ పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి బి. సత్తయ్య, ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

● **మర్కుక్:** మర్కుక్ మండల జడ్పీహెచ్‌ఎస్‌లో బాడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జి. వెంకటేశం, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రావు, రమణారావు, రమేష్, సిద్ధయ్య, యాదిరెడ్డి, సీఆర్‌పీ అంజమ్మ, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

● **సిద్దిపేట రూరల్/నారాయణరావుపేట:** సిద్దిపేట రూరల్ మండలం, నారాయణరావుపేట మండలాల వ్యాప్తంగా బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారులు శ్రీనివాస్‌రెడ్డి, యాదవరెడ్డి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

● **చేర్యాల:** బడిబాట కార్యక్రమాన్ని చేర్యాల, కొమురవెల్లి మండలాలలో ప్రారంభించారు. బడిఈడు పిల్లలను తప్పక ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఏజీపీసీ చైర్మన్, ఎస్‌హెచ్‌జీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● **బెజ్జంకి:** మండల కేంద్రంలో బడిబాట కార్యక్రమంలో భాగంగా బడి మానేసిన పిల్లలను గుర్తించడంతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు తల్లిదండ్రులతో పాటు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపీడీవో లక్ష్మప్ప కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

● **హుస్నాబాద్‌రూరల్:** మండలంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమ్లఓ ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● **నంగునూరు:** ప్రభుత్వ ప్రభుత్వ ఆదేశాల మేరకు బడిబాటలో భాగంగా నంగునూరులో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నంగునూరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గొట్టిపర్తి రామస్వామిగౌడ్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



మద్దూరు: బడిబాటలో భాగంగా ఇంటింటి ప్రచారంలో జిల్లా విద్యాశాఖ అధికారి



కుకునూరుపల్లి: బడిబాట కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



నారాయణరావుపేట: బడిబాటలో భాగంగా కరపత్రాలు పంచుతున్న ఉపాధ్యాయులు

## విద్యార్థులకు రోజూ అరగంట యోగా నేర్పించేలా ఆదేశాలు ఇవ్వాలి



యోగాపై అవగాహన కల్పిస్తున్న బండి రాములు

సిద్దిపేట టౌన్, జూన్6: పాఠశాలల్లోని విద్యార్థులకు ప్రతి రోజు అరగంట పాటు యోగా నేర్పించేలా కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశాలు ఇవ్వాలని అంతర్జాతీయ యోగా శిక్షకుడు బండి రాములు కోరారు. సిద్దిపేట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో గురువారం ఈ నెల 21 ప్రపంచ యోగ దినోత్సవం సందర్భంగా ఆయన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటి వరకు భారతదేశంతో పాటు పలు దేశాల్లో యోగాపై లక్షలాది మందికి ఉచితంగా యోగా శిక్షణ తరగతులు నిర్వహించినట్లు చెప్పారు. విద్యార్థులు స్వచ్ఛందంగా యోగాపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. యోగ వల్ల పరిపూర్ణమైన ఆరోగ్యం లభిస్తుందని, ఎన్నో రోగాలను నయం చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో యోగార్థులు ఏల్పుల స్వామి తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

● పంచాయతీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాగల లక్ష్మణ్



వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కొండపాక, జూన్ 6: గ్రామపంచాయతీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని పంచాయతీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాగల లక్ష్మణ్ కోరారు. గురువారం జిల్లా పంచాయతీ అధికారి దేవకి దేవికి ఆయన వినతిపత్రం అందజేశారు. పెండింగ్ వేతనాలు ఇప్పించాలని, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి బ్రాహ్మండ్లపల్లి పరుశురాములు, విజయ్‌కుమార్, సంతోష్‌కుమార్, ఆర్. రవి, పంతం రాజు వివిధ గ్రామాల సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలి

● సిద్దిపేట జిల్లా బీసీ సంక్షేమ అధికారి బి.సరోజ




కార్యక్రమంలో మాట్లాడుతున్న సరోజ

గజ్వేల్, జూన్ 6: మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని సిద్దిపేట జిల్లా బీసీ సంక్షేమ అధికారి బి.సరోజ పేర్కొన్నారు. గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ శిక్షణ శిబిరంలో భాగంగా ఆరో రోజు నిర్వహించిన మహిళా సాధికారత అనే అంశంపై ప్రసంగించారు. మహిళా విద్య కోసం సావిత్రిబాయి పూలే కృషి, వివిధ సంఘ సంస్కర్తల కృషిని గుర్తు చేశారు. మహిళలు ఎదుర్కొనే సమస్యలను తెలియజేసిన వాటి పరిష్కార మార్గాలను తెలియపరిచారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగాలని, పురుషులకు దీటుగా రాణించాలన్నారు. ఆరో రోజు శిక్షణలో భాగంగా యోగా, కవాతు, ఆయుధ శిక్షణ, ఫైరింగ్, సిమ్యూలేటర్ లపై శిక్షణ ఇచ్చారు. వారితో క్యాంపు కమాండెంట్ మధుసూదన్‌రావు, బీసీ సంక్షేమ శాఖ అసిస్టెంట్ అధికారి మురళి, కళాశాల బీసీ సంక్షేమాధికారి దేవదాసు, ప్రీ మెట్రిక్ స్కూల్ బీసీ అధికారి జానకిరాము, సుబేదార్ మేజర్ రామ్‌హరి, కెప్టెన్ భవానీలు ఉన్నారు.

## మంత్రిని కలిసిన డీసీసీబీ చైర్మన్



మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న చిట్టి దేవేందర్‌రెడ్డి

కొండపాక, జూన్ 6: ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. డీసీసీబీ ద్వారా రైతులకు అందిస్తున్న సేవలను ఈ సందర్భంగా మంత్రికి ఆయన వివరించారు. 400 కోట్ల లావాదేవీలతో ఉన్న బ్యాంకును 2200 కోట్ల లావాదేవీలకు తీసుకువచ్చి అభివృద్ధి చేసినట్టు ఆయన వివరించారు. రైతులకు అన్ని విధాలుగా డీసీసీబీ అండగా ఉండి సేవలు అందించాలని మంత్రి అన్నారు. మంత్రిని కలిసిన వారిలో డీసీసీబీ డైరెక్టర్ జగన్మోహన్‌రెడ్డి, పోలీస్ కృష్ణ ఉన్నారు.

## భూనిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

● సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బండ్ల స్వామి

గజ్వేల్, జూన్ 6: మల్లన్నసాగర్ భూనిర్వాసిత గ్రామ ప్రజల సమస్యలను సీఎం చొరవ తీసుకుని పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బండ్ల స్వామి డిమాండ్ చేశారు. గజ్వేల్‌లో ఆయన మాట్లాడుతూ.. మల్లన్నసాగర్ ప్రాజెక్టు నిర్మాణ ప్రారంభ దశలో భూసేకరణ మొదలుకొని, గ్రామాలు విడిచి వచ్చేవరకు ముంపు బాధిత గ్రామాల ప్రజలు పోరాడుతూనే ఉన్నారని, వారి సమస్యల పరిష్కారానికి మార్గాలు చూపాలని ప్రభుత్వాలను కోరుతున్నారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడంతో ముంపు బాధిత గ్రామాల ప్రజలు వారికి న్యాయం జరగాలని, అధికారంలో ఉన్న కాంగ్రెస్‌కు మెజారిటీ ప్రజలు అండగా నిలిచారన్నారు. భూనిర్వాసితుల పోరాటాలకు గతంలో సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా ఏటిగడ్డ కిష్టాపూర్‌లో దీక్షలో పాల్గొని భూ నిర్వాసితుల పోరాటాలకు మద్దతు తెలిపారని గుర్తు చేశారు. భూనిర్వాసితులకు రావాల్సిన ప్యాకేజీలు, పరిహారాలు ఎప్పుడొస్తాయా అని ఎదురుచూస్తూ భూనిర్వాసితులు మనోవేదనకు గురవుతున్నారన్నారు.

## కస్తూర్బాలో పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

చేర్యాల, జూన్ 6: చేర్యాల పట్టణంలోని కస్తూర్బా బాలికల విద్యాలయంలో అసిస్టెంట్ కుక్-2, స్వీపర్ కమ్ స్కావెంజర్ -2 పోస్టులు ఖాళీలిగా ఉన్నాయని, తాత్కాలిక ప్రాతిపదికన పనిచేయడానికి దరఖాస్తులు చేసుకోవాలని చేర్యాల మండల ఇన్‌చార్జి ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునేందుకు స్థానిక మహిళలు అర్హులని, 7వతరగతి ఉత్తీర్ణురాలై ఉండాలని తెలిపారు. ఈనెల 11వ తేదీలోగా సంబంధిత పత్రాలు జతపరిచి కస్తూర్బా పాఠశాలలో అందజేయాలని, మరిన్ని వివరాలకు 6301719169ను సంప్రదించాలని కోరారు.

### కార్యాలయానికి పేరేదీ?



సాధారణంగా ప్రభుత్వ కార్యాలయాలపై అవి ప్రభుత్వ కార్యాలయాలు అని ప్రజలకు తెలిసేలా వాల్ పేయింట్‌తో పేరు రాసి ఉండటం చూస్తుంటాం. కానీ చిన్నకోడూరు ఎంపీడీవో కార్యాలయానికి నెలలుగా ఎలాంటి బోర్డు లేకపోవడం గమనార్హం. కార్యాలయానికి గతంలో ఏర్పాటు చేసిన నేమ్ బోర్డు కొన్ని నెలల క్రితం ఊడిపోయింది. అప్పటి నుంచి అధికారులు కార్యాలయానికి వాల్ పేయింట్‌తో పేరు రాయించడం, నేమ్ బోర్డు ఏర్పాటు చేయడం కానీ చేయలేదు. ఎంపీడీవో, తహసీల్దార్, ఎంఈవో, మండల మహిళా సమాఖ్య కార్యాలయాలు ఒకే కాంపౌండ్‌లో ఉన్నాయి. దీంతో ఎంపీడీవో కార్యాలయానికి పని నిమిత్తం వచ్చే ప్రజలు ఎంపీడీవో కార్యాలయం ఏదో తెలియక గందరగోళానికి గురవుతున్నారు.

- చిన్నకోడూరు

## ఎమ్మెల్యేను కలిసిన నాయకులు

చేర్యాల, జూన్ 6: ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యను గురువారం చేర్యాల మండల కురుమ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యాదగిరిగుట్టలో నిర్వహించిన ఆయన జన్మదిన వేడుకల్లో ఆయనకు నోటుబుక్కులు, పెన్నులు అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అందె అశోక్, జంగిలి యాదగిరి తదితరులు ఉన్నారు.

## ఆలయంలో చోరీ

దూళిమిట్ట, జూన్ 6: మండలంలోని తోర్నాల గ్రామంలో ఉన్న దుర్గమ్మ ఆలయంలో బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారని గ్రామస్థులు తెలిపారు. అమ్మవారి మెడలోని పుస్తెల తాడు, ముక్కుపుడక, మరికొన్ని చిన్న చిన్న ఆభరణాలు చోరీకి గురైనట్లు వారు వెల్లడించారు. ఈ విషయమై మద్దూర్ ఎస్‌ఐ యూనస్ అహ్మద్ అలీని వివరణ కోరగా ఎవరు ఫిర్యాదు చేయలేదని తెలిపారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గజ్వేల్/మద్దూరు/సిద్దిపేట టౌన్, జూన్ 6: గజ్వేల్ పట్టణంలోని తూప్రాన్ రోడ్డులో ఉన్న 132/33 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా నేడు గజ్వేల్, వర్గల్, ములుగు, మర్కుక్, రాయపోల్ మండలాల్లోని గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని గజ్వేల్ విద్యుత్ శాఖ డీఈ ఆర్. భానుప్రకాశ్ తెలిపారు. నేడు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు అంతరాయం ఉంటుందని, ప్రజలు సహకరించాలని కోరారు. గజ్వేల్ పట్టణంలో ఉదయం 9గంటల నుంచి 10గంటలు, మధ్యాహ్నం 1.30గంటల నుంచి 2.30 గంటల మధ్య విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. నేడు మద్దూరు మండలంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మద్దూరు విద్యుత్ ఏఈ సుధీర్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ముస్త్యాల సబ్‌స్టేషన్‌లో అదనంగా ట్రాన్స్‌ఫార్మర్ బిగింపు చేపడుతున్న నేపథ్యంలో మద్దూరు మండలంలో ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. సింగిల్ ఫేజ్ కోసం నర్మెట్ట విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా అందించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ సిద్దిపేట డీఈ జి. మహేష్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సిద్దిపేట పట్టణంలోని అన్నీ వార్డులు, సిద్దిపేట రూరల్ మండలంలోని అన్నీ గ్రామాలు, నారాయణరావుపేట మండల కేంద్రంతో పాటు, లక్ష్మీదేవిపల్లి, కోదండారావుపల్లి, బంజారుపల్లి, ఇబ్రహీంపూర్ గ్రామాలు, అర్బన్ మండలంలోని పొన్నాల, కిష్టసాగర్, ఎన్సాన్‌పల్లి గ్రామాలు, మెడికల్ కళాశాల ప్రాంతం, మిట్టపల్లిలోని డీఎక్స్ఎన్, ఎల్లుపల్లి గ్రామాలలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు.

## నేడు జగదేవ్‌పూర్ మండల సర్వసభ్య సమావేశం

జగదేవ్‌పూర్, జూన్ 6: జగదేవ్‌పూర్ మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ బాలేశంగౌడ్, ఎంపీడీవో యాదగిరిలు తెలిపారు. ఉదయం 11:30 గంటలకు జరిగే సమావేశానికి మండలంలోని ఎంపీటీసీలు, అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు.

## మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి శిక్ష

సిద్దిపేట క్రైం, జూన్ 6: సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ, సిబ్బందితో కొన్ని రోజుల క్రితం వాహనాలు తనిఖీ నిర్వహించారు. ఈ క్రమంలో 21 మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని గురువారం సిద్దిపేట కోర్టులో హాజరుపరచగా విచారణ చేసి 21 మందికి రూ.10,500 జరిమానా, వారిలో ఒక్కరికి ఒక రోజు జైలు శిక్ష విధించారు.

## ఉపాధిహామీ పనుల పరిశీలన



ఉపాధిహామీ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

దూళిమిట్ట, జూన్ 6: మండల కేంద్రంలో ఉపాధిహామీలో భాగంగా చెరువులో జరుగుతున్న పూడికతీత పనులను గురువారం ఎంపీడీవో రామ్మోహన్ పరిశీలించి, కూలీలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల మొత్తం కూలీలు పనులకు వచ్చి రోజు రూ.300లు కూలీ వచ్చే విధంగా పనులు చేసుకోవాలన్నారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి బడిబాట కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏంపీవో ఖాజామోయినుద్దీన్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాజుగౌడ్, ఫీల్డ్ అసిస్టెంట్, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## 'నాణ్యమైన విత్తనాలు అందించాలి'

వర్గల్, జూన్ 6: విత్తనాల కంపెనీ యాజమానులు రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని, నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు, వ్యవసాయాధికారులు హెచ్చరించారు. మండల పరిధిలోని గౌరారంలోని క్రిస్టల్ విత్తన పరిశ్రమను జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారి జానకి రామ్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి శేషశయన కలిసి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విత్తనాల పరిశ్రమలో ఉన్న స్టాక్ రిజిష్టర్, ఇన్వాయిస్ పెపర్లతో పాటు గోదాంలో నిల్వ ఉన్న విత్తనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విత్తనాలకు సంబంధించి రికార్డులు సక్రమంగా ఉండాలని, నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వారివెంట టాస్క్‌ఫోర్స్ పోలీసు సిబ్బంది, వ్యవసాయ శాఖ ఏఈవో సంతోష్ తదితరులు ఉన్నారు.

## హాస్టల్ భవనం కేటాయించాలని వినతి



వినతిపత్ర సమర్పిస్తున్న దృశ్యం

చేర్యాల, జూన్ 6: చేర్యాల పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్ బిల్డింగ్‌ను నర్మెట్ట గురుకుల పాఠశాలకు కేటాయించ కుండా, స్థానిక ఎస్సీ విద్యార్థులకు కేటాయించి న్యాయం చేయాలని కోరుతూ, ఏఐఎస్ఎఫ్ నాయకులు గురువారం సిద్దిపేట డీఎస్సీడీవో కవితకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రామగల్ల నరేశ్ మాట్లాడుతూ.. చేర్యాల ప్రాంత ఎస్సీ బాలుర విద్యార్థుల సంక్షేమం కోసం భవనం నిర్మించిన ప్పటికీ, పొరుగు జిల్లాలకు చెందిన విద్యాసంస్థలకు కొనసాగింపచేస్తుండడం తగదన్నారు. ఆయనవెంట వర్కింగ్ ప్రెసిడెంట్ సంగెం మధు, ప్రధాన కార్యదర్శి జెర్రిపోతుల జనార్దన్, మహిళా ప్రెసిడెంట్ శిరీష ఉన్నారు.

## దాతల సహకారం ఎనలేనిది

● ఈవో బాలాజీశర్మ

చేర్యాల, జూన్ 6: కొమురవెల్లి మల్లన్న ఆలయాభివృద్ధిలో దాతల సహకారం ఎనలేనిదని ఈవో బాలాజీశర్మ పేర్కొన్నారు. మల్లన్న దర్శనార్థం వచ్చే భక్తులకు తాగునీటిని అందించేందుకు వరంగల్ జిల్లాకేంద్రానికి చెందిన యశ్పాల్ సోనియా రూ.4లక్షల వ్యయంతో ఆలయ నిత్యాన్నదానసత్ర సమీపంలో ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంటును ఆయన గురువారం ప్రారంభించారు. యశ్పాల్ సోనియాకు స్వామివారి ప్రసాదం అందించి సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకుడు మహదేవుని మల్లికార్జున్ పాల్గొన్నారు.

## కుళ్లిపోయిన కోడిగుడ్లపై విచారణ



విచారణ చేస్తున్న సూపర్‌వైజర్ పావని

చేర్యాల, జూన్ 6: కొమురవెల్లి మండలం తపాస్‌పల్లిలో అంగన్‌వాడీకేంద్రంలో కుళ్లిపోయిన కోడిగుడ్లు పంపిణీ చేసిన విషయమై గురువారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పావని విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా కేంద్రంలో స్టాకును పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. లబ్ధిదారుల నుంచి కుళ్లిపోయిన కోడిగుడ్లను వెనక్కి తీసుకుని మంచి గుడ్లను అందజేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.

## నేడు ఎమ్మార్పీఎస్ సమావేశం

గజ్వేల్, జూన్ 6: నేడు సిద్దిపేట పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో మధ్యాహ్నం 1 గంటకు ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల కార్యవర్గ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు ముంద్రాతి కృష్ణ తెలిపారు. గజ్వేల్‌లో ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ ఆదేశాల మేరకు వచ్చే నెల 7న జరిగే ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా, వరంగల్‌లో నిర్వహించే కవాతును విజయవంతం చేసేందుకు జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యవర్గంతో పాటు అనుబంధ సంఘాల కార్యవర్గ సభ్యులు హాజరుకావాలని పిలుపునిచ్చారు. డ్రెస్‌కోడ్ తప్పనిసరిగా పాటించాలని కోరారు.

# భువనగిరిలో అదే సంప్రదాయ తీర్పు

● మళ్లీ తొలిసారి బరిలో నిలిచిన అభ్యర్థికే పట్టం

● చామల గెలుపుతో కొనసాగిన సెంటిమెంట్

చేర్యాల, జూన్ 6 : భువనగిరి పార్లమెంటు నియోజకవర్గ ఓటర్లు ప్రతీ ఎన్నికలో మొదటిసారి పోటీ చేసిన అభ్యర్థులకే గెలుపు కట్టబెడుతున్నారు. ఈసారి అదే సంప్రదాయాన్ని కొనసాగించారు. లోక్‌సభ పునర్విభజన అనంతరం 2009లో కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఇక్కడి నుంచి తొలిసారి పోటీచేసి నోముల నర్సింహయ్యపై గెలుపొందగా, 2014లో రెండోసారి బరిలో నిలబడగా ఓటమి చవిచూశారు. ఆ ఎన్నికలో మొదటిసారి ఎంపీ బరిలో నిలిచిన బూర నర్సయ్యగౌడ్‌ను విజయం వరించింది. అయితే, 2019లో మరోసారి పోటీచేసిన బూర నర్సయ్యగౌడ్‌కు ఓటమి ఎదురైంది. నాడు తొలిసారి ఎంపీగా పోటీచేసిన కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి విజయబావుటా ఎగురవేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డితో పాటు బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశం తొలిసారిగా ఎంపీ బరిలోకి దిగగా, బూర నర్సయ్య మూడోసారి తలపడ్డారు. మొదటిసారి పోటీచేసిన కిరణ్‌కుమార్‌రెడ్డికే విజయం చేకూర్చి ఇక్కడి ఓటర్లు సంప్రదాయాన్ని కొనసాగించారు.

### ప్రముఖుల ఇలాఖాల్లో

జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి స్వగ్రామం నర్సాయపల్లిలో 167 ఓట్లు, టీపీసీసీ అధికార ప్రతినిధి మొగుళ్ల రాజిరెడ్డి స్వగ్రామం వీరన్నపేటలో 60 ఓట్ల మెజారిటీ కాంగ్రెస్‌కు దక్కింది. చేర్యాల మండల అధ్యక్షుడు కొమ్ము రవి స్వగ్రామమైన ఆకునూరులో 232 ఓట్లు, మల్లన్న ఆలయ మాజీ చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి స్వగ్రామం వేచరేణిలో 93 ఓట్లు ఆధిక్యం కాంగ్రెస్‌కు వచ్చింది కొమురవెల్లి మండలం 978 ఓట్లు మెజారిటీ ఇవ్వగా, ఐనాపూర్ గ్రామం 287 ఓట్ల మెజారిటీతో టాప్‌గా నిలిచింది. అలాగే బీఆర్ఎస్‌కు సంబంధించి ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్ స్వగ్రామం నాగపురిలో 184 ఓట్లు మెజార్టీ వచ్చింది. కొమురవెల్లి ఎంపీపీ తలారి కీర్తన స్వగ్రామం మర్రిముచ్చాలలో కాంగ్రెస్ 98 ఓట్లు మెజారిటీ పొందింది.. వైస్ ఎంపీపీ తాండ్ర నవీన్‌రెడ్డి స్వగ్రామమైన చుంచనకోట గతంలో 777 ఓట్లు మెజారిటీ ఇవ్వగా ప్రస్తుతం 18 ఓట్లు బీఆర్ఎస్ మెజారిటీ కొనసాగించి పట్టుని లుపుకున్నారు.

### కాశీగుడిశెలో కమలానికి చుక్కెదురు

బీజేపీ అనూహ్యంగా ఓట్లను కైవసం చేసుకున్నది. గతానికి భిన్నంగా సెగ్మెంట్ పరిధిలోని ప్రతీ గ్రామంలో గట్టి పోటీనిచ్చి ద్వితీయ స్థానంలో నిలిచినప్పటికీ సిద్దిపేట జిల్లా పరిధిలోని చేర్యాల మండలం కాశీగుడిశెలు గ్రామంలో మాత్రం చతికిలపడింది. ఈ గ్రామంలో ఒక్క ఓటు కూడా రాలేదు. గతంలో ఆకునూరు శివారు కాలనీగా ఉన్న కాశీగుడిశెలు 2018లో నూతన గ్రామపంచాయతీగా ఏర్పడింది. గ్రామంలో అందరూ ముస్లింలే కాగా, బీఆర్ఎస్‌కు 126, కాంగ్రెస్‌కు 179 ఓట్లు వచ్చాయి. బీజేపీ బోణీ చేయకపోవడం గమనార్హం.

# రూ. 4 లక్షల విలువైన గుట్కా స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గుట్కా ప్యాకెట్లతో అధికారులు

సిద్దిపేట క్రైం, జూన్ 6: సిద్దిపేట పట్టణంలో గుట్కా విక్రయాలపై పోలీసులు కొరడా ఝుళిపిస్తున్నారు. సిద్దిపేట పట్టణంలోని సుభాష్ రోడ్‌లో ఉన్న హరిహర హోల్‌సేల్ కిరాణా షాపులో యజమాని గుండ శ్రీనివాస్ ప్రభుత్వం నిషేధించిన గుట్కాలు అమ్ముతున్నాడని విశ్వసనీయ సమాచారం మేరకు గురువారం సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, వన్‌టౌన్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ప్రభుత్వం నిషేధించిన రూ.2,73,700 విలువ చేసే గుట్కా, ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సిద్దిపేట పట్టణంలోని కరీంనగర్‌రోడ్ సంజీవయ్యనగర్ సీఎస్ఆర్ ఎంటర్‌ప్రైజెస్ హోల్‌సేల్ దుకాణంలో తనిఖీలు చేశారు. రూ.1,41,750 విలువ చేసే గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని దుకాణ యజమాని యజమాని చీకోటి శ్రీనివాస్‌పై టూటౌన్ పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ పోలీస్ అధికారులు, మాట్లాడుతూ.. జిల్లాలో ఎక్కడైనా ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా చేసినా నిల్వ ఉంచిన, చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చట్ట వ్యతిరేకమైన కార్యక్రమాలు ఎవరైనా పాల్పడుతున్నట్లు తెలిస్తే సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ అధికారుల నెంబర్లు 8712667445, 8712667446, 8712667447లకు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

## తెలంగాణ చిహ్నంపై వినతిపత్రం

రాయపోల్, జూన్ 6: తెలంగాణ ప్రభుత్వం అధికారిక చిహ్నాన్ని మార్చనున్న తరుణంలో ధర్మ సమాజ్ పార్టీ రూపొందించిన చిహ్నాన్ని ఆమోదించాలని గురువారం రాయపోల్ తహసీల్దార్ దివ్యకు ఆ పార్టీ సభ్యులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ధర్మసమాజ్ పార్టీ మండల సభ్యులు నందు, అర్జున్, హేమాజీ, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## గోమాతకు నామకరణ మహోత్సవం




గోమాతకు నామకరణ చేస్తున్న మంజులరాజనర్సు

సిద్దిపేట టౌన్, జూన్6: సిద్దిపేట పట్టణంలోని రావిచెట్టు హనుమాన్ ఆలయంలోని హనుమాన్ గోశాలలో గురువారం గోమాత నామకరణ మహోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో సిద్దిపేట మున్సిపల్ చైర్‌పర్సన్ కడవేరుగు మంజుల రాజనర్సు పాల్గొన్నారు. ఈ మేరకు గోమాతకు రాధమ్మగా నామకరణం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కోఆప్షన్ సభ్యురాలు బచ్చు సుజాతరమేష్ తదితరులు పాల్గొన్నారు.

## యూనిఫామ్స్ అందజేత

మర్కుక్, జూన్ 6: మండలంలోని ఇప్పలగూడెం ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థులకు ఉచిత స్కూల్ యూనిఫామ్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఏపీఎం బ్రహ్మచారి మాట్లాడుతూ.. రాష్ట్ర విద్యాశాఖ ఆదేశానుసారం మండలంలోని 4 జిల్లా పరిషత్ పాఠశాలలు, 6 ప్రాథమికోన్నత పాఠశాలలు, 12 ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు ఉచిత యూనిఫాంను మరో 2 రోజుల్లో అందజేస్తామని అన్నారు. కార్యక్రమంలో సీసీలు నాగరాజు, హరిచందు, కవిత, సీఏ కృష్ణమూర్తి, వీవోఏలు తదితరులు పాల్గొన్నారు.

## నీట్‌లో సత్తా చాటిన శరత్‌చంద్ర



బెజ్జంకి, జూన్ 6: బెజ్జంకి అనుబంధ గ్రామమైన పాపయ్యపల్లి గ్రామానికి చెందిన విద్యార్థి దోనే శరత్‌చంద్ర నీట్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి సత్తా చాటాడు. శరత్ చంద్ర నీట్‌లో 720 మార్కులకు గాను 568 మార్కులు సాధించి ఆల్ ఇండియా స్థాయిలో 94.89 శాతంతో ఉత్తీర్ణత సాధించాడు. వ్యవసాయ కుటుంబానికి చెందిన దోనే వసంత, ప్రభాకర్‌ల ద్వితీయ పుత్రుడైన శరత్‌చంద్ర నీట్‌లో సత్తా చాటడంతో గ్రామస్థులు అభినందించారు.

## జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

● అదనపు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి బి.ప్రియాంక



న్యాయమూర్తి ప్రియాంక

గజ్వేల్, జూన్ 6: గజ్వేల్ కోర్టు ఆవరణలో జూన్ 8న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని అదనపు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ బి.ప్రియాంక కోరారు. గజ్వేల్ పట్టణంలోని కోర్టులో గురువారం ఆమె మాట్లాడుతూ.. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పోలీస్ విభాగం, సంబంధిత అధికారులు కృషిచేసి ఎక్కువ మందికి న్యాయం చేసేందుకు ముందుకు రావాలన్నారు. వారితో మండల లీగల్ సర్వీస్ సిబ్బంది నర్సింహచారి, యామిని, కోర్టు సిబ్బంది ఉన్నారు.

## మల్లన్న భూములపై పట్టింపు లేదా?

● సీపీఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి

చేర్యాల, జూన్ 6 : కొందరు కాంగ్రెస్ నాయకులు మల్లన్న ఆలయ భూమల ఆక్రమణలకు పాల్పడుతున్నారని సీపీఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి ఆరోపించారు. గురువారం సీపీఎం, ఆల్‌ఇండియా ఫార్వర్డ్‌బ్లాక్ పార్టీ, సీపీఐ నాయకులు మల్లన్న ఆలయ భూములను పరిశీలించారు. ఏడేళ్లక్రితం ఆలయ భూములను సర్వే చేసి ప్రహరి నిర్మించారని, కోట్లాది రూపాయల విలువైన భూములను కొందరు చిరువ్యాపారులకు అక్రమంగా లీజుకు ఇచ్చి లబ్ధిపొందుతున్నారని ఆరోపించారు. భూ ఆక్రమణల విషయమై ఈవో బాలాజీకి పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినా పట్టించుకోవడంలేదన్నారు. కార్యక్రమంలో ఆల్‌ఇండియా ఫార్వర్డ్ బ్లాక్‌పార్టీజిల్లా కార్యదర్శి అందె బీరయ్య, నాయకులు శెట్టిపల్లి సత్తిరెడ్డి, కుడికాల బాలమోహన్, తాడూరి రవీందర్, అత్తిని శారద, బద్దిపడిగ కృష్ణారెడ్డి, తాడూరి మల్లేశం, బక్కెల్లి బాలకిషన్, ఆరుట్ల రవి, నీల బిక్షపతి, కర్రోల్ల ఎల్లయ్య, దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

## పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత

జగదేవ్‌పూర్, జూన్ 6: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను జగదేవ్‌పూర్ పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి గురువారం బాధతుడికి అందజేశారు. ఎస్ఐ చంద్రమోహన్ తెలిపిన వివరాల ప్రకారం మర్కుక్ గ్రామానికి చెందిన తలారి సురేష్ కొద్ది రోజుల క్రితం తన సెల్‌ఫోన్‌ను జగదేవ్‌పూర్‌లో పోగొట్టుకున్నాడు. బాధితుడు జగదేవ్‌పూర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్‌ను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. బాధితుడికి పోలీస్‌స్టేషన్‌లో సెల్‌ఫోన్‌ను హెడ్‌కానిస్టేబుల్ జనార్దన్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు ఉన్నారు.